ప్రతిభ ఉండి, తగిన కృషి చేస్తే ఆకర్షణీయ అవకాశాలను అందిపుచ్చుకోగలమని నిరూపించింది మెదక్ జిల్లా నర్సాపూర్‌లో చదివిన సంహిత. బీవీఆర్‌ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ నాలుగో సంవత్సరం చదువుతున్న ఈ అమ్మాయి.. మైక్రోసాఫ్ట్ సంస్థలో ఏడాదికి రూ.52 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం సాధించింది. ఇదెలా సాధ్యమైందో తన మాటల్లోనే..

కోడింగ్, కొత్త టెక్నాలజీలు అందిపుచ్చుకుని..

- మైక్రోసాఫ్ట్‌లో రూ.52 లక్షల ప్యాకేజీ
- ఇంజినీరింగ్ విద్యార్థిని సంహిత ఘనత

మాది సంగారెడ్డి జిల్లా ముదిమాణిక్యం. మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చాను. ఇంటర్ పూర్తయ్యాక ఎంసెట్‌లో మంచి ర్యాంకు రావడంతో బీవీఆర్‌ఐటీలో సీఎస్ఈ కోర్సులో సీటు దొరికింది. మొదటి నుంచి కెరియర్‌ను దృష్టిలో ఉంచుకునే చదివా. ఇప్పుడు మంచి ప్యాకేజీతో ఉద్యోగం రావడం ఎంతో సంతోషంగా ఉంది.

ఇంజినీరింగ్ మొదటి నుంచే కెరియర్ ఎలా ఉండాలనే ఆలోచన ఉండేది. అధ్యాపకుల సహకారంతో ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాను. ఇంజినీరింగ్ తొలి సంవత్సరం నుంచే లాజికల్ థింకింగ్, ప్రాబ్లమ్ సాల్వింగ్, కోడింగ్ నైపుణ్యాలు మెరుగుపరుచుకునేందుకు ప్రయత్నించాను. రెండో సంవత్సరంలో మైక్రోసాఫ్ట్ సంస్థలో ఇంటర్న్‌షిప్ కోసం దరఖాస్తు చేశాను. దాంతో కంపెనీ నుంచి కాల్ వచ్చింది. ఆ తర్వాత దశలవారీగా ఇంటర్వ్యూలు నిర్వహించారు. మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు, కోడింగ్, గ్రూప్ డిస్కషన్.. ఇలా పలు రౌండ్స్ జరిగాయి. ప్రాజెక్టు కూడా ఇచ్చారు. వాటన్నింటిని సమర్థంగా పూర్తి చేయడంతో ఇంటర్న్‌షిప్ నిమిత్తం తీసుకున్నారు. రూ.1.25 లక్షల స్టైపెండ్‌తో మూడునెలల పాటు బెంగళూరులో ఇంటర్న్‌షిప్ పూర్తిచేశాను. ఆ సమయంలో చూపిన ప్రతిభను గుర్తించి ఇప్పుడీ ఉద్యోగానికి ఎంపిక చేశారు.

ఇంజినీరింగ్ పూర్తి కావడానికి నాలుగేళ్ల సమయం ఉంటుంది కాబట్టి ప్రణాళికాబద్ధంగా అడుగేయాలి. కంప్యూటర్ సైన్స్ విభాగాన్ని ఎంపిక చేసుకునేవారు ప్రధానంగా కోడింగ్‌పై దృష్టిపెట్టాలి, తర్వాత వారి ఆసక్తిని బట్టి అనుబంధ విభాగాలవైపు వెళ్లవచ్చు. కమ్యూనికేషన్ నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలి. ఇంగ్లిష్ మాట్లాడే విషయంలో ఎలాంటి భయాందోళనలూ లేకుండా స్పష్టంగా మాట్లాడాలి. ఇంటర్వ్యూ సమయంలో మన ప్రవర్తనను గమనిస్తుంటారు. నాయకత్వ లక్షణాలు పెంచుకోవాలి. ఎవరితో ఎలా మాట్లాడాలనే అవగాహనతో మెలగాలి. అనుమానాల నివృత్తికి ఎవరిని సంప్రదించాలో గుర్తించాలి.

ఇంటర్న్‌షిప్‌లో..

క్లౌడ్, అజ్యూర్, డాట్‌నెట్ టెక్నాలజీలపై నిర్దిష్ట సమయంలో మూడు నెలల్లో ప్రాజెక్టు పూర్తి చేశాను. ఆ సమయంలో కంపెనీ వారితో తరచూ సంప్రదిస్తూ అనుమానాలను నివృత్తి చేసుకున్నాను. ఇంటర్న్‌షిప్ సమయంలో కళాశాలలో నిర్వహించే పరీక్షలకూ హాజరయ్యాను. మేటి అవకాశాలు పొందడానికి.. విద్యార్థులు లాజికల్ థింకింగ్ నైపుణ్యం పెంచుకోవాలి. ఒక సమస్య వచ్చినప్పుడు దాన్నెలా పరిష్కరించాలో ఆలోచించగలగాలి. కోడింగ్ బాగా నేర్చుకోవాలి. ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో ఏవైనా కొన్ని సర్టిఫికేషన్స్ పూర్తిచేయాలి. ఒక కంపెనీకి దరఖాస్తు చేసే ముందు రెజ్యూమెను దానికి ఉపయోగపడే విధంగా మార్చాలి. ఆ తర్వాత దరఖాస్తు చేయడం ద్వారా అధికంగా అవకాశాలుంటాయి. సీ, పైతాన్ వంటి వాటిపై సర్టిఫికేషన్ కోర్సులు చేయడంతోపాటు నూతన టెక్నాలజీలను అందిపుచ్చుకోవాలి. ఈమేరకు మా డిపార్ట్‌మెంట్ అధిపతి డా. మధుబాబు, ఇతర అధ్యాపకుల సలహాలను పాటించాను.

కంపెనీ అవసరాలకు అనుగుణంగా..

సమస్యా పరిష్కార నైపుణ్యాలతోపాటు, టాస్క్‌లను తక్కువ సమయంలో పరిష్కరించగలిగే సత్తా ఉంటే మంచి ప్యాకేజీ సాధించవచ్చు. డేటా స్ట్రక్చర్స్ నేర్చుకోవడం మరింత ఉపయోగపడుతుంది. ఏదైనా ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్‌ను పూర్తిస్థాయిలో ఉపయోగించగలగాలి. సీ ప్లస్ ప్లస్, జావా, పైతాన్ వంటి వాటిపై కనీస అవగాహన అవసరం. విద్యార్థులు కంపెనీల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంచుకోవాలి. కంపెనీ ఏ సాంకేతికతపై ముందుకు వెళుతుందో తెలుసుకుని తదనుగుణంగా అడుగేయాలి. లేదా ఆసక్తి ఉన్న అంశాలను అంతకుముందే తెలుసుకుని ఉంటే వాటిని ఎంచుకోవచ్చు. యూట్యూబ్, గూగుల్‌తో ఇప్పుడు చాలా సులభంగా అన్నీ నేర్చుకునే వీలు కలుగుతోంది. ఇలా సొంతంగా నేర్చుకోవడం ద్వారా ఐఐటీ, ఎన్ఐటీల విద్యార్థులకు వచ్చే లాంటి అవకాశాలు అందుకోవచ్చు.

కొత్త ఆలోచనలతో..

మనమున్న రంగంలో కొత్త ఆలోచనలు చేసేందుకు ప్రయత్నించాలి. అవి కార్యరూపం దాల్చేవరకు పట్టువదలకూడదు. కష్టపడాలనే ఆలోచన ఉండాలే కానీ అవకాశాలు వాటంతటవే వస్తాయనడంలో సందేహం లేదు. నేర్చుకునే తపన ఉండాలి. కళాశాలలో అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలనూ సద్వినియోగం చేసుకోవాలి. ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్‌లో పాల్గొనాలి, తద్వారా మన ప్రొఫైల్ మెరుగుపడుతుంది. ఆత్మవిశ్వాసమూ పెరుగుతుంది!

– కణతాల భిక్షపతి చారి, న్యూస్‌టుడే, నర్సాపూర్

'డిజైన్' చేసుకుంటారా మీ కెరియర్?

చెప్పులు, చెవిదిద్దులు, బ్యాగులు, బెల్టులు, గాజులు, గ్లాసులు, వివిధ పరికరాలు, ఫర్నిచర్, ఇంటీరియర్, వెబ్‌సైట్లు, గ్రాఫిక్స్, వీడియో గేమ్స్.. ఇలా ప్రతీదీ వైవిధ్యభరితంగా, చూస్తున్నకొద్దీ చూడాలనిపించేలా.. రూపొంది, మంత్రముగ్ధులను చేస్తుంటాయి. వీటి తళుకుల వెనుక డిజైనర్ల సృజన దాగి ఉంది. అందుకే వీరికి విశ్వవ్యాప్తంగా ఆదరణ లభిస్తోంది. మేటి అవకాశాలతోపాటు ఆకర్షణీయ వేతనాలూ పొందుతున్నారు. మేటి డిజైనర్లను రూపొందించడానికి ప్రత్యేక సంస్థలూ వెలిశాయి. వాటిలో ప్రవేశాలకు దరఖాస్తులు మొదలయ్యాయి!

కొన్ని మేటి సంస్థలు

ఐఐటీలు: ఐఐటీ బాంబే, దిల్లీ, గువాహటి, హైదరాబాద్, మరికొన్ని సంస్థల్లో డిజైన్ యూజీ, పీజీ కోర్సులు చదువుకోవచ్చు. ఇందుకోసం యూసీడ్, సీడ్ పరీక్షల్లో ప్రతిభ చూపాలి. ప్రకటన త్వరలో వెలువడుతుంది.

నిఫ్ట్‌లు: దేశవ్యాప్తంగా ఉన్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ (నిఫ్ట్)లు డిజైన్ కోర్సులూ అందిస్తున్నాయి. బ్యాచిలర్ ఆఫ్ డిజైన్‌లో.. ఫ్యాషన్ డిజైన్, లెదర్ డిజైన్, యాక్సెసరీ డిజైన్, టెక్స్‌టైల్ డిజైన్, నిట్‌వేర్ డిజైన్ వీటిలో చదువుకోవచ్చు. కొద్ది రోజుల్లో ప్రకటన వెలువడుతుంది.

దేశవ్యాప్తంగా ఉన్న ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్లలో ఫుట్‌వేర్ ఒక్కటే కాకుండా పలు విభాగాల్లో డిజైన్ కోర్సులు అందిస్తున్నారు. ఎఫ్‌డీడీఐ నిర్వహించే పరీక్షతో ప్రవేశం లభిస్తుంది. త్వరలో ప్రకటన వస్తుంది.

శ్రేష్ఠ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆర్ట్, డిజైన్ అండ్ టెక్నాలజీ; పెర్ల్ అకాడెమీ, సింబయాసిస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్, విట్, ఎస్ఆర్ఎం, రాంచీ, ఆమిటీ, దిల్లీ, గాల్గోటియా యూనివర్సిటీలు డిజైన్ కోర్సుల్లో పేరొందాయి. వీటిలో పలు సంస్థలు నిడ్/ యూసీడ్/ నిఫ్ట్/ఎఫ్‌డీడీఐ స్కోరుతో అవకాశం కల్పిస్తున్నాయి.

ఏయే స్పెషలైజేషన్లు?

ఇండస్ట్రియల్ డిజైన్: వీరు తయారీ సంస్థల్లో వస్తువు, ఉత్పత్తిని డిజైన్ చేస్తారు. ఫర్నిచర్, ఇంటీరియర్, ఇంజినీరింగ్ ప్రొడక్టులు, సిస్టమ్స్, కన్స్యూమర్ గూడ్స్, క్రాఫ్ట్ బేస్డ్ ప్రొడక్ట్స్ యాక్సెసరీస్, పర్సనల్ యూజర్ ప్రొడక్ట్స్ కిచెన్ టూల్స్ అండ్ అప్లయన్సెస్, కొత్తతరం ఎలక్ట్రానిక్స్, ఐటీ, తదితర సంస్థల్లో పనిచేయవచ్చు.

టెక్స్‌టైల్ డిజైన్: జనాల అవసరాలు, అభిరుచులను పరిగణనలోకి తీసుకుని టెక్స్‌టైల్ డిజైనర్లు వస్త్రాలను రూపొందిస్తారు. సౌకర్యవంతం, ఆకర్షణీయంగా ఉండేలా వాటిని తీర్చిదిద్దుతారు. ప్రతి ఒక్కరికీ తప్పనిసరి అవసరాల్లో దుస్తులు ఒకటి. ఎక్కువమంది.. దుస్తుల ఎంపికలో వైవిధ్యం, నాణ్యత, మన్నికలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. వీరికి టెక్స్‌టైల్ పరిశ్రమలు, రెడీమేడ్ దుస్తుల కంపెనీలు, రిటైల్ సంస్థల్లో అవకాశాలు లభిస్తాయి.

గ్రాఫిక్ డిజైన్: ప్రపంచం గ్రాఫిక్ మయమవుతోంది. అన్ని రంగాల్లోనూ ఈ గ్రాఫిక్స్ ప్రాధాన్యం పెరుగుతోంది. ఈ కోర్సు పూర్తిచేసుకున్నవారు గ్రాఫిక్ డిజైనర్లగా, బ్రాండ్ ఐడెంటిటీ డెవలపర్, లోగో డిజైనర్, విజువల్ ఇమేజ్ డెవలపర్, మల్టీమీడియా డెవలపర్, పబ్లికేషన్ డిజైనర్‌గా పనిచేయవచ్చు. బహుళజాతి కంపెనీలు, అడ్వర్టైజింగ్, ఆన్‌లైన్ మీడియా, టీవీ, వినోద పరిశ్రమల్లో వీరు ఉద్యోగాలు పొందవచ్చు.

ఫ్యాషన్ డిజైన్: ఈ కోర్సులు చదివినవారికి దుస్తులు తయారుచేసే కంపెనీల్లో మేటి అవకాశాలు లభిస్తాయి. అవుట్‌లెట్ ఏర్పాటు చేసుకోవచ్చు. కొంత అనుభవంతో డిజైన్ కన్సల్టెంట్, స్టైలిస్ట్, కస్టమర్ డిజైనర్, ఫ్యాషన్ ఫోర్‌కాస్టర్, ఇలస్ట్రేటర్, ఆంత్రప్రెన్యూర్, అకడమీషియన్, ఫ్యాషన్ మర్చండైజర్, బయ్యర్‌గా కొనసాగవచ్చు.

కమ్యూనికేషన్ డిజైన్: యానిమేషన్ అండ్ ఫిల్మ్ డిజైన్, ఎగ్జిబిషన్ డిజైన్, ఫిల్మ్ అండ్ వీడియో కమ్యూనికేషన్, గ్రాఫిక్ డిజైన్ ఇందులో భాగం. వాణిజ్య ప్రకటనలు, ఆన్‌లైన్ మీడియా, వినోద పరిశ్రమల్లో అవకాశాలు లభిస్తాయి.

లెదర్ డిజైన్: పాదరక్షలు, బెల్టులు, బ్యాగులకు.. విశ్వవ్యాప్తంగా ఆదరణ ఉంది. ఈ విభాగాల్లో దేశీయ, బహుళజాతి సంస్థలెన్నో ఉత్పత్తులు తయారు చేస్తున్నాయి. సోఫాలతోపాటు పలు వస్తువుల తయారీలో లెదర్ వినియోగం పెరిగింది. జంతువుల తోలుతో వీరు ఆకర్షణీయ ఆకృతులు డిజైన్ చేస్తారు.

ప్రొడక్ట్ డిజైన్: పరిశ్రమలు, వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తులు రూపొందిస్తారు. ఎక్కువ మన్నికగా, మరింత తేలికగా, తక్కువ స్థలంలో ఇమిడేలా, ఆకర్షణీయంగా ఉండేలా, నిర్వహణ భారం లేకుండా, కొద్ది మొత్తంతోనే తయారయ్యేలా ఉత్పత్తులను ప్రొడక్ట్ డిజైనర్లు తయారుచేస్తారు. వీరికి వస్తు తయారీకి చెందిన అన్ని పరిశ్రమల్లోనూ అవకాశాలుంటాయి.

డిజైన్ విభాగంలో స్పెషలైజేషన్ ఏదైనప్పటికీ.. అవకాశాలకు ఢోకా లేదు. సృజన, ఊహ, చిత్రిక నైపుణ్యాలు ఉన్నవారు బాగా రాణించగలరు. మేటి విద్యాలయాల్లో చదువు పూర్తిచేసుకున్నవారిని బహుళజాతి, దేశీయ సంస్థలు ప్రాంగణ నియామకాల్లో పెద్ద మొత్తంలో వేతనంతో అవకాశం కల్పిస్తున్నాయి.

ప్రవేశ పరీక్ష ఇలా..

డిజైన్ ఆప్టిట్యూడ్ టెస్టు(డీఏటీ)లో ప్రిలిమ్స్, మెయిన్స్ ఉంటాయి. ప్రిలిమ్స్ వంద మార్కులకు నిర్వహిస్తారు. వ్యవధి 3 గంటలు. పెన్సిల్/పెన్నుతో సమాధానాలు రాయాలి. ప్రశ్నపత్రం ఆంగ్లంలో ఉంటుంది. ప్రిలిమ్స్ ఉత్తీర్ణులకు మెయిన్స్ నిర్వహిస్తారు. తుది నియామకాలు ప్రిలిమ్స్, మెయిన్స్‌లో సాధించిన మార్కుల మెరిట్‌తో ఉంటాయి. మాదిరి ప్రశ్నపత్రాలు నిడ్ వెబ్‌సైట్‌లో ఉంచారు. పరీక్షపై అవగాహనకు ఇవి ఉపయోగపడతాయి.

ఉపాధి అవకాశాలు

ఈ సంస్థల్లో చదివినవారు ప్రాంగణ నియామకాల్లో మేటి అవకాశాలు సొంతం చేసుకుంటున్నారు. వర్ల్‌పూల్, విప్రో, టైటాన్, ఫిలిప్స్, టాటా, గోద్రెజ్, జేపీ మోర్గాన్, ఎల్‌జీ, మారుతీ సుజుకీ, మైక్రోసాఫ్ట్, మైండ్‌ట్రీ, ఒరాకిల్, రంగోలీ, రెడ్‌బస్, తనిష్క్, వెల్‌స్పన్, జొమాటో...ఇలా పలు సంస్థలు వీరిని ఉద్యోగాల్లోకి తీసుకుంటున్నాయి. చదువుకున్న స్పెషలైజేషన్ ప్రకారం సంబంధిత సంస్థల్లో అవకాశాలు లభిస్తాయి. పీజీ పూర్తిచేసుకున్నవారు ఆకర్షణీయ వేతనాలతో, అత్యున్నత హోదాలు సొంతం చేసుకుంటున్నారు.

అర్హత ఎవరికి?

బ్యాచిలర్ కోర్సులకు ఇంటర్ అన్ని గ్రూపుల విద్యార్థులూ దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రస్తుతం ద్వితీయ సంవత్సరం కోర్సులు చదువుతున్నవారూ అర్హులే. వయసు 20 ఏళ్లలోపు ఉండాలి. జులై 1, 2003 తర్వాత జన్మించాలి. ఓబీసీ, ఎస్సీ, ఎస్టీలకు మూడేళ్లు; దివ్యాంగులకు ఐదేళ్లు గరిష్ఠ వయసులో సడలింపు వర్తిస్తుంది. ఇంటర్ తర్వాత నాలుగేళ్ల బీడిజైన్ లేదా అనుబంధ కోర్సులు చదివినవారు మాస్టర్ ఆఫ్ డిజైన్‌కు అర్హులు.

ఆన్‌లైన్ దరఖాస్తులు: డిసెంబరు 1 మధ్యాహ్నం 4 వరకు స్వీకరిస్తారు.
పరీక్ష తేదీ: డిసెంబరు 24
తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, విజయవాడ.
వెబ్‌సైట్: https://admissions.nid.edu/

నోటిఫికేషన్స్ ఉద్యోగాలు

శ్రీసత్యసాయి జిల్లాలో..

శ్రీసత్యసాయి జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్టుల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో 65 అంగన్‌వాడీ వర్కర్, మినీ అంగన్‌వాడీ వర్కర్, అంగన్‌వాడీ హెల్పర్ ఖాళీల భర్తీకి మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆఫ్‌లైన్ దరఖాస్తులు కోరుతోంది.

పోస్టులు 65

ఐసీడీఎస్ ప్రాజెక్టు: హిందూపూర్, ధర్మవరం, సీకే పల్లి, మడకశిర, పెనుకొండ, కదిరి, నల్లచెరువు, గుడిబండ, సోమందేపల్లి, పుట్టపర్తి, ఓబుళదేవరచెరువు.
వయసు: 21- 35 సంవత్సరాల మధ్య ఉండాలి.
అర్హత: 10వ తరగతి ఉత్తీర్ణత.
దరఖాస్తు: ఆఫ్‌లైన్ దరఖాస్తులను సంబంధిత శ్రీసత్యసాయి జిల్లాలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో అందజేయాలి.
దరఖాస్తుకు చివరి తేదీ: 29-09-2023.
వెబ్‌సైట్: https://srisathyasai.ap.gov.in/

తెలంగాణ ఆయుష్ విభాగంలో..

సికింద్రాబాద్‌లోని డైరెక్టర్ కార్యాలయం, ఆయుష్ శాఖ ఒప్పంద ప్రాతిపదికన డా.బీఆర్‌కేఆర్ ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల (ఎర్రగడ్డ), డాక్టర్ ఏఎల్ ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల (వరంగల్)లో 9 టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.

పోస్టులు 9

● ప్రొఫెసర్: 4 ● అసోసియేట్ ప్రొఫెసర్: 5
అర్హతలు: ఆయుర్వేదంలో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీతోపాటు టీచింగ్ అనుభవం.
వయసు: 01-07-2023 నాటికి 65 ఏళ్లు మించకూడదు. **ఎంపిక:** అకడమిక్ మార్కులు, టీచింగ్ అనుభవం, ఇంటర్వ్యూ.
దరఖాస్తు: ఆఫ్‌లైన్ దరఖాస్తులను 'డైరెక్టర్ కార్యాలయం, ఆయుష్ శాఖ, సికింద్రాబాద్, తెలంగాణ రాష్ట్రం' చిరునామాకు పంపించాలి.
దరఖాస్తుకు చివరి తేదీ: 29-09-2023.
వెబ్‌సైట్: https://ayush.telangana.gov.in/

కరూర్ వైశ్యాలో బ్యాంకింగ్ అప్రెంటిస్

కరూర్ వైశ్యా బ్యాంక్ లిమిటెడ్ దేశ వ్యాప్తంగా ఉన్న కేవీబీల్లో బ్యాంకింగ్ అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
అర్హత: 50% మార్కులతో ఏదైనా విభాగం నుంచి 2022, 2023లో నాన్-ఇంజినీరింగ్ గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణత. పని ప్రదేశంలో కనీసం ఒకదానిలోనైనా స్థానిక భాష మాట్లాడటం తెలిసి ఉండాలి. ఇంగ్లిష్ భాషా పరిజ్ఞానం ఉండాలి.
వయసు: 31.03.2023 నాటికి 20- 24 ఏళ్ల మధ్య ఉండాలి.
ఎంపిక: షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు ఇంటర్వ్యూ నిర్వహిస్తారు.
ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ: 30-09-2023.
వెబ్‌సైట్: https://www.karurvysya-bank.co.in/Careers/kvb_Careers.asp

ఇఫ్కోలో అగ్రికల్చర్ గ్రాడ్యుయేట్ ట్రైనీలు

న్యూదిల్లీలోని ఇండియన్ ఫార్మర్స్ ఫెర్టిలైజర్ కోఆపరేటివ్ లిమిటెడ్, ప్రధాన కార్యాలయం- అగ్రికల్చర్ గ్రాడ్యుయేట్ ట్రైనీ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఎంపికైన అభ్యర్థులు దేశవిదేశాల్లో స్థాపితమైన ఇఫ్కో కేంద్రాలు/ కార్యాలయాలు/ ప్రాజెక్టుల్లో విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.
అర్హత: జనరల్/ ఓబీసీ అభ్యర్థులు కనీసం 60%, ఎస్సీ/ ఎస్టీ అభ్యర్థులు కనీసం 55% మార్కులతో బీఎస్సీ (అగ్రికల్చర్) డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. నవంబర్, 2023 నాటికి చివరి సెమిస్టర్ పరీక్షలు రాసిన అభ్యర్థులూ దరఖాస్తు చేసుకోవచ్చు.
వయసు: 01 ఆగస్టు, 2023 నాటికి 30 సంవత్సరాలు మించకూడదు. ఎంపికైన అభ్యర్థులకు మొదటి ఏడాది శిక్షణ అందిస్తారు. ఈ సమయంలో నెలకు రూ.33,000 స్టైపెండ్ అందుతుంది. అనంతరం రూ.37,000-రూ.70,000 జీతంతో పాటు ఇతర అలవెన్సులు చెల్లిస్తారు.
ఎంపిక: ప్రిలిమినరీ కంప్యూటర్ బేస్డ్ ఆన్‌లైన్ టెస్ట్, ఫైనల్ ఆన్‌లైన్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూ, సర్టిఫికెట్ వెరిఫికేషన్, మెడికల్ టెస్ట్ ఆధారంగా.
పరీక్ష కేంద్రాలు: అహ్మదాబాద్, బెంగళూరు, దిల్లీ, కోల్‌కతా, చెన్నై, లఖ్‌నవూ, నాగ్‌పుర్, గువాహటి, పట్నా, రాయ్‌పుర్, సూరత్, వారణాసి, చండీగఢ్, దేహ్రాదూన్, పుణె, హైదరాబాద్, విజయవాడ, కొచ్చిన్, జోధ్‌పుర్, జమ్మూ, సిమ్లా, భోపాల్, జబల్‌పూర్.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 07-10-2023.
వెబ్‌సైట్: https://www.iffco.in/en/corporate
ఆన్‌లైన్ దరఖాస్తు: https://agt.iffco.in/LOGIN-2/iffco-agt.jsp



ఎంబీఏల్లో ఏది మెరుగు?

నా ఫ్రెండ్ బీబీఏ చేసి ఎంబీఏ చదవాలనుకుంటున్నాడు. డిస్టెన్స్ ఎంబీఏ/ ఈఎంబీఏల్లో ఏది మెరుగు? ఆపరేషన్స్ ఇంజినీర్‌గా పదేళ్ల అనుభవం కూడా ఉంది.
– రవిశంకర్

■ మీ స్నేహితుడికి బీబీఏతో పాటు పది సంవత్సరాల ఉద్యోగానుభవం ఉంది కాబట్టి ఈఎంబీఏ (ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ) చదవడమే మంచిది. డిస్టెన్స్ ఎంబీఏలో చాలామంది విద్యార్థులు ఉద్యోగానుభవం లేకుండా నేరుగా అడ్మిషన్ తీసుకొంటారు. చాలా డిస్టెన్స్ ఎంబీఏ ప్రోగ్రాంలలో కాంటాక్ట్ క్లాసులకు హాజరు అవ్వాల్సిన అవసరం కూడా లేనందున నైపుణ్యాలను నేర్చుకొనే అవకాశం ఉండదు. ఈఎంబీఏ క్లాస్ రూంలో అందరూ ఉద్యోగానుభవం ఉన్నవారే ఉండటం వల్ల ఒకరి అనుభవం నుంచి మరొకరు నేర్చుకొనే అవకాశాలు ఎక్కువ. ఈఎంబీఏ ప్రోగ్రాంలో ప్రతి సెమిస్టర్‌లో కొన్ని కాంటాక్ట్ క్లాసులు తప్పనిసరి. ప్రొఫెసర్స్ నుంచి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు. ఈఎంబీఏ బోధనావిధానం కూడా డిస్టెన్స్ ఎంబీఏ కంటే భిన్నం. ఈఎంబీఏలో ఎక్కువగా కేస్ డిస్కషన్, సెమినార్లు, గేమ్స్, యాక్టివిటీస్‌ల సహాయంతో బోధన ఉంటుంది. థియరీ కంటే మెనేజీరియల్/ ప్రాక్టికల్ అప్లికేషన్స్‌కు ప్రాముఖ్యం అధికం. ఈఎంబీఏను ప్రముఖ బిజినెస్ స్కూల్స్ నుంచి చేస్తే ఎక్కువ ప్రయోజనాలుంటాయి.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్